క్లుప్తంగా

మహాలక్ష్మమ్మ ఉత్సవాలు ప్రారంభం

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామ దేవత మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు శనివారం ప్రారంభించారు. ఏటా మే నెలలో వచ్చే పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి గరగ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తామని సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు తెలిపారు.

చాగల్లు: స్థానిక మహాలక్ష్మి అమ్మవారి వార్షిక సంబరం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు 12వ తేదీ వరకు కొనసాగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

భారీ అన్నసమారాధన

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద శనివారం దాతల సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు రెండు సూపర్ లగ్జరీ సర్వీసులు

నిడదవోలు : నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్‌కు రెండు సూపర్ లగ్జరీ బస్ సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిపో నుంచి ప్రతి రోజు రాత్రి 7 గంటలకు తాడిమళ్ల, యర్నగూడెం, చిన్నాయిగూడెం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మీదుగా బస్సు హైదరాబాద్ వెళ్లి, తిరిగి అక్కడి నుంచి సాయంత్రం 6.50 గంటలకు నిడదవోలు బయలు దేరుతుందన్నారు. రెండో సర్వీస్ నిడదవోలు డిపో నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి చాగల్లు, పంగిడి, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, అశ్వరావుపేట, ఖమ్మం మీదుగా హైదరాబాద్ చేరుకుంటుందని తెలిపారు. బస్సు హైదరాబాద్ నుంచి బయలుదేరి రాత్రి 8.15 గంటలకు నిడదవోలు చేరుకుంటుందని డీఎం వెంకటేశ్వర్లు తెలిపారు.

డైట్ కళాశాల లెక్చరర్‌గా కోటిపల్లి సరోజిని



ఉండ్రాజవరం: తాడిపర్రు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోటిపల్లి సరోజిని దూబచర్ల డైట్ కళాశాల లెక్చరర్‌గా బదిలీ అయ్యారు. తాడిపర్రు ఉన్నత పాఠశాలలో ఆమె 5ఏళ్లుగా హెచ్‌ఎంగా పని చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ దూబచర్ల బీఈడీ కళాశాలలో లెక్చరర్ల నియామకానికి నిర్వహించిన పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. నియామకానికి సంబంధించి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. బదిలీపై వెళ్తున్న సరోజినిని అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

భారత సైనికులకు మద్దతుగా పూజలు



భారత సైనికులకు మద్దతుగా కొవ్వూరులో నినాదాలు చేస్తున్న నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): ఇండో పాక్ యుద్ధంలో వీరోచితంగా పోరాడుతున్న భారత సైనికులకు మద్దతుగా కొవ్వూరు ట్యాక్సీ స్టాండ్ వద్ద సువర్చలా సహిత అభయాంజనేయ స్వామి ఆలయంలో బీజేపీ నాయకులు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పూజలు నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర



పోలేరమ్మను దర్శించుకుంటున్న మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

నిడదవోలు రూరల్: మునిపల్లి గ్రామ దేవత గోగులమ్మ తల్లి జాతర రెండోరోజు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో అమ్మవారి సేవ నిర్వహించారు. విచిత్ర వేషధారణలు, బుట్టబొమ్మలు, విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పోలేరమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అధ్వాన రహదారిలో అవస్థల ప్రయాణం

- నిడదవోలు- నరసాపురం ఆర్‌అండ్‌బీ రహదారి ఛిద్రం
- దుమ్ము, ధూళితో ప్రయాణికులు, స్థానికులకు ఇక్కట్లు
- ప్రమాదాల బారిన పడుతున్న ద్విచక్ర వాహనదారులు
- గోతులు పూడ్చి చేతులు దులుపుకున్న అధికారులు



ఉసులుమర్రు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై లేస్తున్న దుమ్ము



ఉసులుమర్రు వద్ద ఛిద్రమైన రోడ్డు



పెరవలి వద్ద ఏర్పడిన గోతులు

పెరవలి: నిడదవోలు- నరసాపురం ఆర్‌అండ్‌బీ రహదారి ఛిద్రమై గోతులకు నిలయంగా మారింది. భారీ వాహనాలు రాకపోకల సమయంలో దుమ్ముధూళి వ్యాపించడంతో ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉందని ద్విచక్ర వాహనచోదకులు అంటున్నారు. చాలా చోట్ల రాళ్లు పైకి రావడంతో ఈ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఈ రహదారిపై రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహన చోదకులు అంటున్నారు.

తూతూమంత్రంగా గోతుల పూడ్చివేత

హడావుడిగా గోతులను పూడ్చించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని, కొద్ది రోజులకే మళ్లీ రోడ్డు ఛిద్రమవుతోందని వాహనదారులు అంటున్నారు. ఈ రోడ్డులో రెండు నెలల క్రితం కానూరు పీహెచ్‌సీ వైద్యుడు జారిపడి గాయాలపాలయ్యారు. ఈ రోడ్డుపై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు నిత్యం ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన ఈ రహదారిలో గోతులు ఏర్పడ్డాయి. భారీ వాహనాలు వచ్చేటప్పుడు ఈ గోతుల వద్ద దుమ్ము లేచి వెనుక వాహనదారుల కళ్లల్లో పడి ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళుతున్నప్పుడు వాటి వేగానికి రోడ్డుపై ఉన్న రాళ్లు లేచి వెనుక, ముందు, రోడ్డు పక్కన ఆగిన వారి మీద పడి గాయాల పాలవుతున్నారు.

ఆరు నెలల్లో 45 ప్రమాదాలు

నిడదవోలు -నరసాపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో ముఖ్యంగా ఉసులుమర్రు, కానూరు, తీపర్రు గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇక్కడ ఏర్పడిన గోతులతో పాటు రాళ్లు లేచిపోయి ఉండటం వలన ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆరు నెలల్లో ఈ రహదారిలో ఏర్పడిన గోతులు, రాళ్ల వలన 45 ప్రమాదాలు చోటుచేసుకోగా 17మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో ముగ్గురు మహిళలు, 14 మంది పురుషులు ఉన్నారు. ఈ రోడ్డుపై భారీ గోతులతో పాటు దుమ్ము, రాళ్లు పేరుకుపోవటం వలన వాహనం వెళితే దాని వెనుకే దుమ్ము దట్టంగా ఎగిరి వచ్చి కళ్లల్లో పడి ఆస్పత్రి పాలవుతున్నామని వాహనదారులు చెప్పారు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. తక్షణం స్పందించి ఈ రోడ్డుపై గోతులను పూడ్చించి, పేరుకుపోయిన రాళ్ల తొలగించి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేస్తామని చెప్పి ముందస్తుగా గోతులు పూడ్చి చేతులు దులుపుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి రోడ్డును పూర్తిస్థాయిలో ఆధునీకరించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

పట్టించుకునే నాథుడే కరువు



కానూరు నుంచి పెరవలి వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షాల వలన గోతులు ఏర్పడి రాళ్లు లేచి ఉండటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో ఈ రోడ్డులో ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని రావాల్సి వస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

– కొమ్మిశెట్టి రాము, కానూరు

దుమ్ము, రాళ్ల కారణంగా ప్రమాదాలు



భారీ గోతులతో పాటు రాళ్లు లేచి ఉండటం వలన పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటితో పాటు రోడ్డుపై దుమ్ము పేరుకుపోవడంతో వాహనాలు వచ్చినప్పుడు దుమ్ము, ధూళి వ్యాపించి ముందు ఏ వాహనం వస్తోందో తెలియక గోతుల్లో పడి అనేకమంది వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– కాపకా పాపారావు, కాకరపర్రు

వలీబాషా కుటుంబానికి అండగా ఉంటాం



వలీబాషా కుమార్తెలకు ధైర్యం చెబుతున్న మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు

నిడదవోలు : పట్టణానికి చెందిన వంట మాస్టర్ వలీబాషా హత్యకు గురై మృతి చెందడం అత్యంత బాధాకరమని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. వలీ కుటుంబ సభ్యులను ఆయన శనివారం పరామర్శించారు. వలీ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం పట్టణంలో చర్చిపేటకు చెందిన విద్యార్థి మర్తి ప్రకాష్‌కుమార్ గోదావరి నదిలో మునిగి మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులను, 13వ వార్డుకు చెందిన యువకుడు పోతురాజు అఖిల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. 15వ వార్డులో కౌన్సిలర్ మొదలవలస నాగమణి తల్లి మృతి చెందడంతో ఆయా కుటుంబ సభ్యులను శ్రీనివాసనాయుడు కలుసుకుని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి వెంకట సత్యనారాయణ, కౌన్సిలర్ దాకే అనిల్‌కుమార్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే వలి, ఉసురుమర్తి సూరి పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు సహకరించాలి



కరిచర్లగూడెంలో భూములను పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు

గోపాలపురం: భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు కోరారు. మండలంలోని కరిచర్లగూడెంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భూముల రీసర్వే వల్ల ఇబ్బందులు కలుగుతాయన్న ఆలోచన నుంచి రైతులు బయటపడాలన్నారు. రీసర్వే చేసి, వారికి గల అసలు భూమిని రికార్డుల్లో చేరుస్తామని చెప్పారు. అదేవిధంగా 22ఏ చట్టం ద్వారా వివాదాస్పద భూములను రెవెన్యూ పరిధిలో ఆర్‌డీఓ ద్వారా పరిష్కరించుకోవచ్చని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.అజయ్‌బాబు, మండల సర్వేయర్ ఎం.తులసి, వీఆర్‌ఓలు కె.మురళి, రాంబాబు, సచివాలయ సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన వ్యవసాయ విద్యుత్ ఇవ్వాలి



టౌన్ ఫీడర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి: నాణ్యమైన వ్యవసాయ విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దేవరపల్లి సబ్ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ టౌన్ ఫీడర్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ, రూ.98 లక్షలతో బందపురం, గొల్లగూడెం, రంగరాయ కాలనీ, లక్ష్మీపురం, టౌన్ ఫీడర్లు, రూ.48 లక్షలతో దేవరపల్లి సంత మార్కెట్ ఫీడర్ కొత్తగా ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా నిధులతో ఈ ఫీడర్లను ఏర్పాటు చేశామన్నారు. దేవరపల్లిని మున్సిపాల్టీగా చేయాలనేది తన లక్ష్యమన్నారు. భారత్ – పాక్ యుద్ధంలో జవాన్ మురళీ నాయక్ వీరమరణం పట్ల సభలో రెండు నిమిషాలు మౌనం పాటించి, సంతాపం తెలిపారు. అనంతరం వెంకటేశ్వర నగర్‌లో ఉపాధి హామీ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్ కుమార్, కన్‌స్ట్రక్షన్స్ ఈఈ డేవిడ్, ఏడీఈ రవి శంకర్, ఏఈ సీహెచ్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విద్యాభాండాగారాలు

గోపాలపురం: గ్రంథాలయాలు విద్యాభాండాగారాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పెద్దగూడెం ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు హితయతుల్లా అన్నారు. గ్రంథాలయం వాటి ఉపయోగాలపై స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం ఆయన వివరించారు. గ్రంథాలయాల్లో చదువుకుని అభ్యసించి ఎంతో మంది ఉన్నత శిఖరాలు అధిరోహించారని అన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ మోజులో పడి అనేక రోగాల బారిన పడుతున్నారని, టెక్నాలజీని మంచికి మాత్రమే వాడుకోవాలని, అందులోని చెడును వదిలేయాలని సూచించారు. చదువుకున్న కొంత మంది ఆన్‌లైన్ పేరుతో లక్షల్లో పోగొట్టుకుని చివరికి ఆత్మహత్యల వైపు చూడటం దారుణమన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, వేసవి సెలవుల్లో విద్య, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెజ్జు సత్యనారాయణ, సీఆర్‌పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

తాళ్లపూడి: గజ్జరం మాజీ సర్పంచ్ మల్లిపూడి చిన్న రాములు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా శనివారం తాళ్లపూడి మండల వైఎస్సార్ సీపీ దళిత జేఏసీ నాయకులు రాములు కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు, సర్పంచ్ గండి రాంబాబు, జేఏసీ అధ్యక్షుడు యాళ్ల బాబూరావు, సాయి స్ఫూర్తి హాస్పిటల్ సీఈవో గూడ విజయరాజు, దళిత జేఏసీ నాయకులు తదితరులన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

నల్లజర్ల: స్థానిక వేణుగోపాలస్వామి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం నిత్య హోమం, బలిహరణ, కుంకుమ పూజలు నిర్వహించారు. కనకదుర్గ భక్త సమాజం ఆధ్వర్యాన భగవద్గీత పారాయణ, అచ్యుత భజన మండలి ఆధ్వర్యంలో భజన ఏర్పాటు చేశారు. అనంతరం క్రేజీ మాస్టర్ డ్యాన్స్ ఇన్స్టిట్యూట్ చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, పాశ్చాత్య నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఆర్గనైజర్, కొరియోగ్రాఫర్ దుర్గా ప్రసాద్‌ను పలువురు అభినందించారు. ఆదివారం రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ మద్దిపాటి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి అన్నసమారాధన జరుగుతుందన్నారు.

ధాన్యం సేకరణ లక్ష్యం పెంపు

నిడదవోలు : శెట్టిపేటలో 400 మెట్రిక్ టన్నులు, సమిశ్రగూడెంలో 300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచినట్లు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల అవసరాల మేరకు అధికారులతో చర్చించిన తర్వాత ధాన్యం సేకరణ లక్ష్యం పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించామన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరుని కల్యాణం

- ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి
- స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అన్నవరప్పాడులో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి,అమ్మవార్లు



అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక తులసి పూజ

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు 3వ రోజు శనివారం వైభవంగా కొనసాగాయి. స్వామివారి దర్శనానికి ఉదయం 6 గంటల నుంచి క్యూలైన్‌లో ఆలయ ప్రాంగణం చుట్టూ భక్తులు వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన వేలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. చిన్నపిల్లలకు ఉచితంగా పాలు, దాతల సహకారంతో సత్యనారాయణస్వామి ప్రసాదం, బూందీ పంపిణీ చేశారు. వందల సంఖ్యలో భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. భక్తులందరికీ ఉదయం సాయంత్రం అన్నసమారాధన నిర్వహించారు.

సామూహిక తులసి దళార్చన

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం 108 మహిళలతో సామూహిక తులసి దళార్చన నిర్వహించారు. అనంతరం ఈ అర్చనలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ తులసి మొక్కలను ఆలయం నిర్వాహకులు అందించారు. ఉదయం కుంకుమార్చన, తులసీ దళార్చన పూర్తయిన తరువాత మధ్యాహ్నం పది మంది వేద పండితులతో నిర్వహించిన సదస్యము వైభవంగా నిర్వహించారు.

కన్నుల పండువగా కల్యాణం

వేంకటేశ్వరుడి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవం కొనసాగుతుండగా భక్తుల వేంకటేశ్వరుని నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. స్వామి వారి కల్యాణాన్ని శనివారం బొలిశెట్టి చిన చంద్రరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం కావడంతో వేలాది మంది భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చారు. స్వామి వారు కదళీ ఫలాల అలంకరణలో దర్శనమివ్వడంతో భక్తులు స్వామివారిని చూసి తరించారు. అనంతరం నిర్వహించిన భారీ అన్న సమారాధనలో 10 వేల మంది భక్తులు పాల్గొన్నారు.